క్లుప్తంగా

16న జాతీయ లోక్‌అదాలత్


రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయసేవాదికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయ సేవాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్‌అదాలత్‌ను 16కు మార్చినట్టు చెప్పారు. నిత్యం పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి ఆధ్వర్యంలో రాజీ యోగ్యమైన కేసుల్లో ఇరుపక్షాలకు మధ్య వర్తిత్వం నిర్వహించి రాజీ చేస్తున్నట్టు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. నగరంలోని శాంతినగర్‌కు చెందిన శ్రీ అభయ ఆంజనేయ భజన సమాజం ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. సాయంత్రం సీఆర్‌ఆర్ కళాశాల లెక్చరర్ వేదాంతం విష్ణుప్రసాద్ కలియుగ సాధన అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. నాట్యాచారిణి బంగారు బృంద శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. రాత్రి మచిలీపట్నానికి చెందిన మడమల రాంబాబు భాగవతార్ శ్రీకృష్ణ రాయబారం అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెదపాడు: పది పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ (ఏపీసీ) బి.సోమశేఖర రావు అన్నారు. మంగళవారం పెదపాడు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో 27 పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయన్నారు. ఆయా పాఠశాలల్లో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణం, ప్లే గ్రౌండ్ లెవెలింగ్ కోసం సుమారు రూ. 80లక్షల నిధులు విడుదల చేశామన్నారు. పీఎం శ్రీలో ఎంపికైన పెదపాడు పాఠశాలలోనూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు ఐఎఫ్‌పీ ప్యానళ్లు, బైజ్యూస్ ట్యాబ్‌లు, పాల్ ల్యాబ్, టోఫెల్ బోధన తదితర అంశాలను పరిశీలించామన్నారు. రుచికరమైన మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సరఫరా చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏపీసీ వెంట ఏఎంఓ రెడ్డి రామారావు, ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

పెదపాడు: గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలం వడ్డిగూడెం, కొణికి, సత్యవోలు గ్రామాల్లో మంగళవారం ఆమె బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావుతో కలిసి పర్యటించారు. గ్రామంలో రేషన్ వాహనం రావడం లేదని, రేషన్ సక్రమంగా ఇవ్వడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో వెంటనే సివిల్ సప్‌లై జిల్లా అధికారులతో మాట్లాడి వెంటనే వారికి సక్రమంగా రేషన్ అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వడ్డిగూడెంలో నిర్మిస్తున్న ఓహెచ్‌ఎస్ ట్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పుష్కలంగా తాగునీరు

- జగన్ హయాంలో తాగునీటి సమస్యకు చెక్
- రూ.10 కోట్లతో తాగునీటి వ్యవస్థ
- 11 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం
- 20 కిలోమీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు


గుడివాకలంకకు ఏర్పాటుచేస్తున్న పైప్‌లైన్ (ఫైల్)



ఏలూరు రూరల్: పెరుగుతోన్న జనాభాకు అనుగుణంగా తాగునీరు సమస్య పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో పక్కా చర్యలు చేపట్టింది. దెందులూరు నియోజకవర్గం ఏలూరు రూరల్ గ్రామాల్లో కోట్ల రూపాయలు వెచ్చించింది. తాగునీటి వ్యవస్థను మెరుగుపర్చింది. నీటిని శుద్ధి చేసేందుకు మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసింది. గ్రామ శివారు ప్రాంతాలకు సైతం తాగునీరు పుష్కలంగా అందేలా 8 నుంచి 10 అంతస్తుల ఎత్తులో 40 నుంచి 200 కిలో లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకులు 11 నిర్మించింది. వీటి నుంచి 20 కిలో మీటర్ల మేర కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలో వేసవి కాలం వచ్చిందంటే ఏలూరు మండలం గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం గగ్గోల పెట్టేవారు. నేడు గ్రామాల్లో ఆ దుస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

నిర్మాణాలు ఇలా..

మహేశ్వరపురం వద్ద రూ.1.90 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు మైక్రో ఫిల్టర్‌బెడ్లు, మాదేపల్లిలో రూ.80 లక్షలతో 200 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు, చాటపర్రులో రూ.1.3 కోట్లు, మల్కాపురంలో రూ.40 లక్షలతో 90 కేఎల్ రెండో ట్యాంకు, శ్రీపర్రు, గుడివాకలంక రూ.60 లక్షలతో రెండు 60 కేఎల్ ట్యాంకులు, రూ.21 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్ ఏర్పాటుచేశారు. మహేశ్వరపురం, తిమ్మారావుగూడెం, కలకుర్రులో రూ.44 లక్షల చొప్పున వెచ్చించి మూడు ట్యాంకులు, పైప్‌లైన్, కాట్లంపూడి, కోటేశ్వరదుర్గాపురంలో రెండు 40 కేఎల్ ట్యాంకులు, సుమారు రూ.2.37 కోట్లతో ప్రత్తికోళ్లలంక, మాదేపల్లి, కోటేశ్వరదుర్గాపురంలో సీపీడబ్ల్యూఎస్ ట్యాంకు నుంచి పైప్‌లైన్ వేశారు. మొత్తం 660 క్యూబిక్ లీటర్ల సామర్థ్యం గల 11 ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మించారు.


శ్రీపర్రులో నిర్మించిన మైక్రో ఫిల్టర్ బెడ్లు


మాదేపల్లిలో నిర్మించిన సంపు, ఓవర్‌హెడ్ ట్యాంకు

సంతోషంగా ఉంది



గతంలో తాగునీటి కోసం పడ్డ వెతలు తలుచుకుంటేనే భయమేస్తుంది. మా తల్లి దండ్రులు కొల్లేరులో గోతులు తవ్వి నీరు తెచ్చుకున్నారు. మురుగు, కలుషిత నీరు తాగిన దుస్థితీ ఉంది. నీటి కోసం రోజుల తరబడి ఎదురు చూశాం. నేడు అన్ని గ్రామాల్లో ట్యాంకులు కట్టి, ఫిల్టర్ వాటర్ సరఫరా చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– బలే దుర్గ, పెదయానమిల్లి

20 ఏళ్ల వరకూ నీటి సమస్య ఉండదు



కొల్లేరు గ్రామాల్లో మరో 20 ఏళ్ల వరకూ తాగునీటి సమస్య ఉండదు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రభుత్వం నుంచి రూర్బన్ నిధులు సకాలంలో విడుదలయ్యేలా చేశారు. ప్రతి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాం. ఊరంతా పైప్ లైన్ వేశాం. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చాం. మొండికోడు రిజర్వాయర్ నుంచి అన్ని కొల్లేరు గ్రామాలకు సరిపడా నీరు సరఫరా చేయాలన్న మా లక్ష్యం నెరవేరింది. – పెన్మెత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

మొండికోడు నుంచి పైప్‌లైన్



ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, మా గ్రామానికి తాగునీటి సమస్య తీరదనుకున్నాం. కానీ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.35 లక్షలు ఖర్చు చేసి, సుదూరంలో ఉన్న మొండికోడు రిజర్వాయర్ నుంచి మా గ్రామానికి పైప్‌లైన్ వేయడం నమ్మలేకపోతున్నాం. ఎమ్మెల్యే గార్కి ధన్యవాదాలు, అధికారులు గ్రావెటీ పెంచి మరింత తాగునీరు సరఫరా చేయాలని కోరుతున్నాం.

– బలే నాగరాజు, పెదయాగనమిల్లి

సోషలిస్ట్ విప్లవ నేతల్లో అగ్రగణ్యుడు స్టాలిన్


స్టాలిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రపంచ సోషలిస్ట్ నేతల్లో అగ్రగణ్యుడు కామ్రేడ్ స్టాలిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. స్టాలిన్ వర్ధంతి సందర్భంగా స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సభలో రవి మాట్లాడారు. రష్యాలో సోషలిస్టు విప్లవం విజయవంతం కావడానికి కామ్రేడ్ లెనిన్‌తో పాటు స్టాలిన్ పాత్ర ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని వివరించారు. స్టాలిన్ విప్లవ పోరాట యోధుడు మాత్రమే కాదని గొప్ప మానవతావాదని గుర్తుచేశారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ మతోన్మాద భావజాలాన్ని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పి.ఆదిశేషు, వీవీఎస్ ప్రసాద్, ఎస్ సత్యనారాయణ, మీసాల సత్యం, జి.కోటేశ్వరరావు, బి.త్రినాథ్, కె.లెనిన్, పి.దుర్గాప్రసాద్, వి.ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళా వేడుకలు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఎన్జీవోస్ మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన మహిళా వేడుకలు నిర్వహించనున్నట్టు జిల్లా మహిళా శిశు అభివృద్ధి శాఖ అధికారి కేఏఎల్ పద్మావతి పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఏలూరు ఇరిగేషన్ కార్యాలయంలో క్రీడల పోటీలు, మధ్యాహ్నం 4 గంటల నుంచి సురేష్ బహుగుణ స్కూల్ కాంపౌండ్, పోలీస్ కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం

ఏలూరు టౌన్: రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు చావుదెబ్బ తప్పదని, వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలోని 44, 46 డివిజన్లలో మంగళవారం ఆయన వైఎస్సార్‌సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గన్ బజార్ మీసేవా కేంద్రం ఎదురుగా మహ్మద్ నూర్ ఇంటి వద్ద 44వ డివిజన్ కార్పొరేటర్ పొలిమేర రామదాసు ఆధ్వర్యంలో, పెన్షన్ లైన్ ఏఆర్‌డీజీకే స్కూల్ సమీపంలో షేక్ హుమయూన్ ఇంటి వద్ద 46వ డివిజన్ కార్పొరేటర్ షేక్ అయేషా సుల్తానా, పార్టీ నగర మైనార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ అలీఖాన్ ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తలతో నాని మమేకమయ్యారు. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ఏలూరు సభలో వలంటీర్ వ్యవస్థపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారని, వలంటీర్లు సంచులు మోసే పనే అంటూ చులకనగా మాట్లాడిన చంద్రబాబు నేడు వలంటీర్లను కొనసాగిస్తామంటూ ఏ విధంగా హామీ ఇస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన వలంటీర్, సచివాలయ వ్యవస్థను ముట్టుకునే సాహసం చేయగలరా అంటూ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అండగా ఉంటూ వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేని చంద్రబాబు నేడు అంతకుమించి ఇస్తానంటూ హామీలు ఇస్తే నమ్మే పరిస్థితిలో జనం లేరని నాని అన్నారు. సమావేశాల్లో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ నాయకులు మేతర సురేష్, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ముస్లిం మైనార్టీ నాయకులు ఉన్నారు.


44వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, వేదికపై ఇడా చైర్మన్ బొద్దాని


46వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

7న మహిళా చైతన్య సదస్సు

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో మహిళా చైతన్య సదస్సు కళా నీరాజనం, 55 మంది మహిళలకు అభినందన సత్కారాలు నిర్వహించనున్నట్టు నిర్వాహక కమిటీ పేర్కొంది. స్థానిక పవరేపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం హేలాపురి బాలోత్సవం అధ్యక్షుడు అలపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సదస్సు ఫ్లెక్సీని విడుదల చేశారు. ఈ సందర్భంగా అడుసుమిల్లి నిర్మల మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా నిర్వహించే సదస్సుకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కమిటీ నాయకురాలు కె.స్వరూపరాణి ప్రధాన వక్తగా హాజరుకానున్నట్టు చెప్పారు. మహిళా అభ్యున్నతి, సమస్యలపై కాలేజీ విద్యార్థులు, టీచర్లు, శ్రామిక మహిళలకు చిత్రలేఖనం, మహిళా అభివృద్ధి అనే అంశంపై ఉపన్యాసం పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుడిపాటి నరసింహారావు, పి.ఆంజనేయులు, జి.శారద, ఎ.మోహిని, పి.కనకదుర్గ, ఎం.గంగాభవాని, కె.శ్రావణికుమారి, పి.సూర్యప్రకాష్‌రావు, కె.శ్రీనివాసరావు, టి.తులసి, టి.నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


మహిళా చైతన్య సదస్సు ఫ్లెక్సీ విడుదల చేసిన నిర్వాహకులు

మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన

ఏలూరు (టూటౌన్): ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండి, ఎటువంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనాలని ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి పిలుపు నిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కులు, బాల్యవివాహాలు, మహిళా చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ వంటి విషయాలపై స్థానిక గాంధీనగర్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన అవగాహన సదుస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హెచ్‌ఎం అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో మహిళా చట్టాలు, హక్కులపై పద్మావతి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బి.మంగ, మహిళా పోలీసు కేవీ నాగమణి, ఏఎన్‌ఎం జి.వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.నవతి, ఎస్ వెంకటలక్ష్మి, ఐ.రాధ, ఎస్ రాజేశ్వరి, ఎ.మహేశ్వరి, 8, 9 తరగతుల విద్యార్థినులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

నేడు ఏలూరు వార్షిక బడ్జెట్

- రూ.243.84 కోట్లతో అంచనాలు
- రూ.233.52 కోట్ల ఖర్చులు
- ముగింపు నిల్వ అంచనా రూ.10.31 కోట్లు

ఏలూరు టౌన్: ఏలూరు నగరాభివృద్ధే లక్ష్యంగా ఏలూరు నగరపాలక సంస్థ పాలకమండలి 2024–25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు అంచనాలు రూపొందించింది. దీనిని బుధవారం నిర్వహించే ఏలూరు కార్పొరేషన్ కౌన్సిల్ సర్వసభ్య ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెడతారు. కార్పొరేషన్ ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.243,84,12,000 బడ్జెట్ అంచనాలను రూపొందించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి ప్రారంభ నిల్వ రూ.46.39 కోట్లుగా చూపిస్తుండగా, నగరపాలక సంస్థకు వచ్చే ఆదాయం రూ.197.44 కోట్లుగా ఉంది. ఖర్చులు రూ.233.52 కోట్లుగా ఉండగా, ముగింపు నిల్వ రూ.10.31 కోట్లు ఉంటుందని అంచనాలు రూపొందించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారంతో మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన కౌన్సిల్ ఆమోదం అనంతరం మరింత అభివృద్ధికి సమాయత్తమయ్యారు.

ఆదాయం రూ.76.35 కోట్లు


ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం

ఏలూరు నగరపాలక సంస్థకు సుమారు రూ.76.35 కోట్లు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఆస్తి పన్ను రూపంలో రూ.40 కోట్లు, ఖాళీ స్థలాల పన్నుల రూపంలో రూ.2 కోట్లు, స్టాంప్ డ్యూటీపై సర్‌చార్జీలు రూ.7 కోట్లు, మార్కెట్, కార్పొరేషన్ దుకాణాలు రూ.7.96 కోట్లు, తాగునీటి పంపు చార్జీలు రూ.5 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్స్‌లు రూ.6.75 కోట్లు చొప్పున సమకూరనున్నాయి.

గ్రాంట్లు ఇవే..

ఏలూరు కార్పొరేషన్‌కు సుమారు రూ.121 కోట్ల గ్రాంట్ల రూపంలో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అర్బన్ హెల్త్ సెంటర్ల గ్రాంట్స్ రూ.4.50 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.30 కోట్లు, స్వచ్ఛభారత్ నిధులు రూ.30 లక్షలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.ఒక కోటి, ఏసీడీపీ గ్రాంట్ రూ.2 కోట్లు ఇలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి గ్రాంట్ల రూపంలో నిధులు రాబట్టేందుకు పాలక మండలి కృషి చేస్తోంది.

నగరాభివృద్ధే లక్ష్యం



ఏలూరు నగరాన్ని అభివృద్ధి పదంలో నడిపించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండతో నిధులను రాబట్టుకుంటూ నగరంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు, నగర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నాం. రాబోయే ఏడాది నగరంలో మరింత అభివృద్ధిని చేసి చూపించాలనే లక్ష్యంతో ఉన్నాం.

– షేక్ నూర్జహాన్, నగర మేయర్, ఏలూరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	37
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	09

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	22

నైపుణ్య శిక్షణతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ పొందడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక ఐటీఐ కళాశాలలో రూ.1,73,73,000తో చేపట్టే కాలేజీ ఆధునికీకరణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ నిధులు రూ.70 లక్షలతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో భవిత కార్యక్రమానికి శంకుస్థాపన ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతో కలిసి ఆమె వీక్షించారు. అనంతరం ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ పి.రజిత అధ్యక్షతన నిర్వహించిన సభలో పద్మశ్రీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధిని కల్పిస్తున్నట్టు చెప్పారు. ఐటీఐ కాలేజీకి ప్రహరీ నిమిత్తం రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏలూరు జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 100 రైస్ మిల్లులను సాంకేతిక పరంగా మోడరన్‌గా తీర్చిదిద్దారని, రైస్ మిల్లులో సాంకేతిక పరమైన ఉద్యోగాలకు 300 మంది విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. బీసీ నాయకుడు గంటా ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ రజిత మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశాఖపట్నంలో చేపట్టిన 22 ఐటీఐ కాలేజీల ఆధునికీకరణ పనులలో వట్లూరు ఐటీఐ ఒకటని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భావన నారాయణ, సర్పంచ్ జి.రత్నకుమారి, ఎంపీపీలు పి.అరుణ కుమారి, జె.మరియమ్మ, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిషోర్, అసిస్టెంట్ ఇంజినీర్ శేషుకుమార్ కుమార్, ఏపీ ఈ డబ్ల్యూ ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం సదాశివరావు డీఈఏ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన

దెందులూరు: మలకచర్లలో మహిళ వద్ద నుంచి రూ. 2.90 లక్షలు అక్రమంగా కాజేసిన టీడీపీ సాధికార మిత్రపై పోలీసులు తగు చర్యలు తీసుకొని, బాధితురాలికి న్యాయం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి గొల్ల కిరణ్ కోరారు. మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి కొవ్వలి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.